క్లుప్తంగా

10న వేలంపాట

గడివేముల: మండల కేంద్రంలో వెలసిన మూల పెద్దమ్మవారి జాతర సందర్భంగా భక్తులు సమర్పించే తలనీలాలను పోగుచేసుకునే హక్కుల కోసం ఈ నెల 10వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ రామలింగారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆలయం ఆవరణలో వేలంపాట నిర్వహించనున్నట్లు చెప్పారు. నెల రోజుల పాటు జరిగే అమ్మవారి జాతరలో భక్తులు సమర్పించే తలనీలాలను పోగుచేసుకునేందుకు ఆసక్తి గల వారు వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

గడివేముల: మండల పరిధిలోని ఎల్‌కే తాండ గ్రామ సమీపంలోని ఎర్రమల కొండల్లో నాటుసారా తయారు చేస్తున్నారన్న సమాచారం రావడంతో దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ బ్రహ్మయ్య గురువారం తెలిపారు. దాడులు నిర్వహించి 500 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. అనంతరం నవోదయం కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. నాటుసారా, డ్రగ్స్ తీసుకుంటే ఆరోగ్యం దెబ్బతింటుదన్నారు. గ్రామాల్లో ఎవరైనా సాటుసారా విక్రయించినా, తయారు చేసినా తమకు సమాచారం అందించాలని కోరారు.

రేపు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని ఎస్.కొంతలపాడు గ్రామంలో ఈ నెల 8వ తేదీన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని యాగంటీశ్వర స్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా నిర్వహించే పోటీల్లో గెలుపొందిన జట్లకు తొలి ఆరు స్థానాలకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల కబడ్డీ క్రీడాకారులు అదే రోజు ఉదయం 9 గంటల్లోగా రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 95531 31338, 82979 78854 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కల్లూరు: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతి ప్రతం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి, వర్గ సభ్యులు నరసింహులు మాట్లాడుతూ పేదలకు ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఇవ్వాలన్నారు.

సర్వేలు సకాలంలో పూర్తి చేయించాలి



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాణెమ్మ

సి.బెళగల్: ప్రభుత్వం చేపట్టిన వివిధ సర్వేలను సచివాలయాల ఉద్యోగులతో సకాలంలో పూర్తి చేయించాలని ఎంపీడీఓ రాణెమ్మ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని చాంబర్‌లో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ సమావేశం నిర్వహించి, సర్వేల పురోగతిపై చర్చించారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య అంశాలు, ఆర్థిక, విద్యా స్థితిగతులపై చేపట్టిన సర్వేలను ఈ వారంలోగా పూర్తి చేయాలన్నారు.

ఈసీ డిజైన్ ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న శాంతిరాముడు

పాణ్యం: మండలంలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్ సర్క్యూట్ డిజైన్ ల్యాబ్‌ను ఆ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎం.శాంతిరాముడు ప్రారంభించారు. సర్క్యూట్ డిజైనలో ఆచరణాత్మక అభ్యాసం, ఆవిష్కరణలను పెంచడంలో ప్రయోగశాల పాత్రను వివరించారు.ఎడ్జ్ పరికరాలు, అనుకరణ సాఫ్ట్‌వేర్, ప్రోటో టైపింగ్ సాధనాలను పరిశీలించారు. పరిశోధన, పరిశ్రమల సహకారాలు, విద్యార్థుల ప్రాజెక్టులకు ప్రయోగశాల ఎలా ఉపయోగపడుతుందో అధ్యాపకులు వివరించారు. హెచ్ఓడీ డాక్టర్ సోఫియా ప్రియదర్శిని, డైరెక్టర్ అశోక్ కుమార్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం చల్ల'కుండ'

- మట్టి కుండలోని నీటితో దాహార్తి నుంచి ఊరట
- ఆరోగ్యానికి శ్రేయస్కరం అంటున్న నిపుణులు
- పేదోడి ఫ్రిజ్‌కు డిమాండు
- వివిధ రంగుల్లో కుండలు, కూజాలు, మట్టి పాత్రల అమ్మకాలు



బూజునూరులో అమ్మకానికి ఉంచిన కుండలు, మట్టి పాత్రలు

గడివేముల: ఇంత కాలం మట్టి కుండ వైపు కన్నెత్తి కూడా చూడని వారు నేడు వాటిని కొనుగోలు చేసేందుకు పరుగులు తీస్తున్నారు. సహజ సిద్ధంగా నీటిని చల్లబరిచే గుణమున్న మట్టి కుండలోని నీరు తాగడం ఆరోగ్యానికి శ్రేయస్కరమని నిపుణలు చెబుతుండటంతో వాటి పట్ల మొగ్గు చూపుతున్నారు. మండుతున్న ఎండల్లో తిరిగి అలసటగా ఇంటికి చేరుకున్నప్పుడు ఓ గ్లాసు మంటి కుండలోని నీరు తాగితే ఎంతో ఊరటగా ఉంటుందని అనుభవపూర్వకంగా తెలుసుకున్న వారు బాహాటంగా పేర్కొంటున్నారు. ఎంతో ఖరీదైన ఫ్రిజ్ లున్న ధనవంతులు సైతం నేడు మట్టి కుండలోని నీటికి తాగేందుకు ఇష్టపడుతున్నారంటే వాటి ప్రాముఖ్యత ఎంటో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో కొందరు మట్టి కుండల్లో వంటలు వండుకుంటున్నారు. ఇప్పటివరకు ఫ్యాషన్ పేరుతో మట్టి పాత్రల వినియోగాన్ని తక్కువగా చేస్తూ వచ్చారు. అల్యూమినియం, స్టీల్ పాత్రలలో సిద్ధం చేసిన ఆహార పదార్థాలతో పాటు ఫ్రిజ్‌లలో నీటిని చల్లబరుచుకుని తాగేవారు. దీనివల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తి ఇబ్బందులు ఎదురైన తర్వాత తిరిగి మట్టిపాత్రల వైపు ఇప్పుడిప్పుడే మక్కువ పెంచుకుంటున్నారు.

రేడియేషన్‌తో ఆరోగ్యానికి చేటు

మారుతున్న కాలానుగుణంగా వాతావరణంలోనూ విపరీతమైన మార్పులు వచ్చాయి. సెల్ టవర్లు, ఏసీలు, కంప్యూటర్లు, టీవీలు, ఫ్రిజ్‌లు, ఓవేన్‌లు, సెల్‌ఫోన్లు తదితర రేడియేషన్ ఉత్పత్తి చేసే పరికరాల మధ్య యాంత్రిక జీవనానికి మనుషులు అలవాటు పడిపోయారు. దీనివల్ల దుష్పరిణామాలు ఉన్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరం రేడియేషన్‌కు గురైతే దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడక తప్పదని హెచ్చరిస్తున్నారు. ఫ్రిజ్‌లోని నీరు తాగడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయనేది అనుభవ పూర్వకంగా తెలుసుకున్న వారు వివరిస్తున్నారు. మట్టి కుండలోని నీరు తాగడం, మట్టి పాత్రల్లో వండిన ఆహార పదార్థాలు తింటే మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చని నిపుణులు అంటున్నారు. ఇదిలాఉండగా గత వారం రోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలు అధికంగా ఉంటున్నాయి. ఈ స్థితిలో గడివేముల మండలంలో ముఖ్యంగా బూజునూరు, గని, గడివేముల, మంచాలకట్ట గ్రామాల్లో కుండలు, కూజాలు అమ్మకాలకు గిరాకీ పెరగింది. కుండలను సైజును బట్టి రూ.100 నుంచి రూ.500 వరకు అమ్ముతున్నారు.

గిరాకీ బాగుంది



మా కుటుంబం దాదాపు 22 ఏళ్ల నుంచి మట్టి కుండల వ్యాపారం చేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం కుండలు, కూజాల వ్యాపారం బాగానే ఉంది. కుండలు సైజును బట్టిని రూ.100 నుంచి 500 వరకు ఉన్నాయి. ఎండలు అధికం కావడంతో ప్రజలు కుండలను కొనుగోలు చేసేందుకు వస్తున్నారు. కుండలతో పాటు అన్ని రకాల మట్టి పాత్రలు అమ్ముతున్నాను. పండుగల సమయంలో మట్టి కుండలకు గిరాకీ విపరీతంగా ఉంటుంది.

– కుమ్మరి శివకృష్ణ, కుండల వ్యాపారి, బూజునూరు గ్రామం

మట్టి కుండలో వండుకుని తింటున్నాం



నా వయస్సు 66 సంవత్సరాలు. నేను కట్టెల పొయ్యిమీద మట్టి కుండలో వండుకున్న ఆహారాన్నే తింటున్నాను. అన్ని కాలాలలో కుండలోని నీటినే తాగుతున్నాను. దీని వల్ల రోగాలు రావు. వ్యాధి నిరోధక శక్తి బాగుంటుంది. బోరింగ్ నీళ్లు తెచ్చుకొని కుండలో పోసుకుని దాహం వేసినప్పుడల్లా తాగుతాను. ఇప్పటివరకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు, నొప్పులు లేవు. అలాగే మా కుటుంబ సభ్యులంతా ఆరోగ్యంగా ఉన్నారు

–దస్తగిరి, గడివేముల గ్రామం

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



జ్యోతి ప్రజ్వాలన చేస్తున్న అతిథులు

కల్లూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శౌరీలు రెడ్డి అన్నారు. గురువారం దూపాడు సమీపంలోని అశోక మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని సాచీ–2025 వేడుకను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి శౌరిలు రెడ్డి, విజయభారతి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వాల చేశారు. మహిళా సాధికారత, మహిళల శక్తి, వివిధ రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను వివరించారు. వివిధ రంగాల్లో విశేష సేవలందించిన 12 మంది మహిళలను ఘనంగా సన్మానించారు. వారంతా విద్యార్థినులతో తమ అనుభవాలు పంచుకున్నారు. జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలను వివరించారు. సీఈఓ డాక్టర్ హరీష్ కృష్ణ, ప్రిన్సిపాల్ నవీన్, చైర్మన్ అశోక్‌వర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

పీపీటీలో ప్రతిభ

పాణ్యం: నంద్యాలలోని శాంతిరాం (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు గురువారం ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన మాస్‌మీట్‌లో పాల్గొని ప్రతిభ చాటారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎండీ తస్నీమ్, ఎస్కే జబీనా పేపర్ ప్రెజెంటేషన్ (పీపీటీ)ఈవెంట్‌లో మొదటి బహుమతి గెలుచుకున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.సుబ్రమణ్యం, డాక్టర్ ఎ.కె.నీరజా రాణి తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు బడ్జెట్‌లో తీరని అన్యాయం



మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి

కోడుమూరు రూరల్: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేతలకు తీరని అన్యాయం జరిగిందని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి విమర్శించారు. గురువారం కోడుమూరులోని ఏఐటీయూసీ కార్యాలయంలో చేనేత కార్మిక సంఘం నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాధవస్వామి మాట్లాడుతూ చేనేత రంగానికి బడ్జెట్‌లో 2వేల కోట్లు కేటాయించాలని విన్నవించినా ప్రభుత్వం రూ.115 కోట్లే కేటాయించడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా ఉన్నాయన్నారు. సర్కారు తీరుపై త్వరలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక చేనేత కార్మిక సంఘం నాయకులు సోమమోహన్, మహబూబ్‌బాషా, వలి, నరసింహులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి



కూలీలతో మాట్లాడుతున్న నాగన్న

ఓర్వకల్లు: ఉపాధి హామీ పథకంలో పెండింగ్ బిల్లులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 12వ తేదీన చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని గుట్టపాడు వద్ద జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ.. జిల్లాలో లక్షలాది పేదలు గ్రామీణ ప్రాంతాలలో జీవిస్తున్నారని, వీరికి ఏ విధమైన సొంత ఆస్తులు లేవన్నారు. ఉపాధి కూలీలకు 10 వారాలైనా కూలి డబ్బులు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఉపాధి హామి చట్టాన్ని నిర్వీర్యం చేసేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో వేసవి అలవెన్స్ కింద 35 శాతం బిల్లులు చెల్లించేవారని, ప్లే స్లిప్‌లు, పనిముట్ల ఖర్చు, మంచినీటి ఖర్చుల నిమిత్తం ఒక మేటి కింద ఐదుగురు కూలీలకు డబ్బులు చెల్లించేవారని గుర్తుచేశారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం వీటన్నింటిని తీసేసి ఉపాధి హామీ చట్టాన్ని చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కూలీకి 200 రోజులు పని కల్పించి, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈ నెల 12వ తేదీన చేపట్టే ఛలో విజయవాడ కార్యక్రమానికి ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో తరలివెళ్లాలని ఆయన కోరారు.

రంగనాథుడికి గజవాహన సేవ

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులం గోదా రంగనాయకి సమేత రంగనాథ స్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు గురువారం ద్వార తోరణ, ధ్వజ కుంభారాధన, శాత్తుమొర, ఉత్సవరులకు స్నపనం, అలంకారం సేవ, గజవాహన సేవ, హంసవాహన సేవ తదితర విశేష కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



గజవాహనంపై రంగనాథ స్వామి, హంస వాహన సేవలో..

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

కర్నూలు: నగర శివారులోని కోడుమూరు రోడ్డులో రిలయన్స్ మార్ట్ వెనుకవైపు ఉన్న రిచ్‌మండ్ విల్లాస్ వంద అడుగుల రోడ్డు పక్కన ఉన్న లోకల్ లారీ అసోసియేషన్ సమీపాన గురువారం గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించింది. మృతురాలి వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటుందని, ఎత్తు 5.2 అడుగులు ఉంటుందని, పసుపు రంగు చీర, ఆకుపచ్చ, గులాబీ రంగు పూల డిజైన్ కలిగిన జాకెట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవు.మతిస్థిమితం లేక కొంతకాలంగా ఆ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ తిరుగుతుండేదని స్థానికులు తెలిపారన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచారు. కేసు విచారణ చేస్తున్నారు.

ఎఫ్ఏఓను సస్పెండ్ చేయాలి

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పదవీ విరమణ చేసి మూడేళ్లు పూర్తయినందున ఈపీఎఫ్ పింఛన్‌కు అర్హత సాధించినప్పటికీ బతికి ఉండగానే చనిపోయినట్లు ఉత్తర్వులిచ్చిన ఫైనాన్స్ అకౌంట్స్ ఆఫీసర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రీజినల్ గౌరవాధ్యక్షుడు అంజిబాబు, ఉపాధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. దాదాపు 20 ఏళ్లు పనిచేసిన సయ్యద్ మాసుం వలీ బతికి ఉండగానే చనిపోయినట్లు అధికారులు సర్టిఫికెట్ ఇవ్వడాన్ని బట్టి చూస్తే వారు ఎంత నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారనేది స్పష్టమవుతోందన్నారు. మాసుంవలీ 2022 జూన్ 30న పదవీ విరమణ చేశారని, ఈపీఎఫ్ పింఛన్‌కు అర్హులైనప్పటికీ చనిపోయినట్లు నిర్ధారించడం దారుణమని వాపోయారు. జరిగిన తప్పిదాన్ని సవరించి న్యాయం చేయాలని కోరారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ లక్ష్మి

కల్లూరు: స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారు కల్లూరు మండలం చిన్నటేకూరులో కల్లూరు, వెల్దుర్తి మండలాల పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు, షెడ్ మిత్రలకు ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు డివిజన్ పంచాయతీ అధికారి లక్ష్మి, డీపీఆర్‌సీ రిసోర్స్ పర్సన్లు జేమ్స్ కృపావరం, కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పంచాయతీలలోని ఘన వ్యర్థాల నిర్వహణపై వివరించారు. తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించాలన్నారు. సేకరించిన చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు తక్కువ ధరకు అందించడం ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం తీసుకురావాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పారిశుద్ధ్యం బాగుంటేనే స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. సర్పంచ్ లక్ష్మన్న, వెల్దుర్తి, కల్లూరు ఈఓఆర్డీలు రవికిషోర్, నగేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



విద్యార్థినులు, మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తిమ్మారెడ్డి

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని పోలీస్ స్టేషన్‌లో మహిళా చట్టాలపై జెడ్పీ పాఠశాల విద్యార్థినులు, మహిళలకు ఎస్ఐ తిమ్మారెడ్డి అవగాహన కల్పించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా సంరక్షణ చట్టాలపై మండలంలోని బాలికలకు, పొదుపు మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ సుజాత, వెలుగు సీసీ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



గూడూరు నగర పంచాయతీలో బ్యాంకు అధికారులను చుట్టుముట్టిన దరఖాస్తుదారులు

కోడుమూరు రూరల్: బీసీ కార్పొరేషన్ అందించే రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి గురువారం గూడూరు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమేష్‌బాబు బ్యాంకు అధికారులతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. భారీ సంఖ్యలో దరఖాస్తుదారులు రావడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. చివరకు అధికారులు వారి నుంచి అర్జీలను స్వీకరించి పంపించేశారు. కాగా నగర పంచాయతీకి బీసీ కార్పొరేషన్ కింద 65యూనిట్లు మంజూరవ్వగా, 361మంది దరఖాస్తులు చేసుకున్నారని, 319 మంది ఇంటర్వ్యూలకు వచ్చినట్లు కమిషనర్ తెలిపారు.

పట్టించుకుంటే దాహం తీరుతుంది



గార్గేయపురంలో దిగువపాడు బస్టాప్ సమీపంలో పనిచేయని చేతిపంపు

కర్నూలు(రూరల్): వేసవి కాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తుతోంది. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం గ్రామాల్లో మరమ్మతులకు గురైన చేతిపంపులను బాగు చేయించాలని గార్గేయపురం, పడిదెంపాడు , దిగువపాడు, నూతనపల్లె, శివరామపురం, పూడురు, పంచలింగాల, పసుపల తదితర గ్రామాల ప్రజలు కోరుతున్నారు

మైపర్‌లో స్పోర్ట్స్ మీట్

కర్నూలు కల్చరల్: కర్నూలు ఏక్యాంప్‌లోని మైపర్ ఫార్మసీ కళాశాలలో గురువారం ఇంటర్ కాలేజ్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. ఎన్‌సీసీ కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాటి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్నల్ డొనాల్డ్ సైమన్ పీటర్స్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో తలపడ్డారు. డైరెక్టర్ ఆదిమూలపు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



వివాహ చట్టంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రఘు

ఓర్వకల్లు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు అన్నారు. మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామంలో సంచార వైద్య చికిత్స కార్యక్రమాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించారు. సంచార వైద్య చికిత్సలో ప్రజలకు, గర్భవతులు, బాలింతలకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని సూచించారు. అనంతరం డాక్టర్ రఘు మాట్లాడుతూ.. బాధ్యతాయుతమైన వైవాహిక జీవితానికి తొలిమెట్టుగా అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని, అలాగాకుండా వివాహం చేస్తే చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారని తెలిపారు. చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయడం వల్ల పుట్టిన బిడ్డతో పాటు, తల్లి శారీరకంగా, మానసిక ఆరోగ్యంతో బాధపడే అవకాశాలు ఉంటాయని వివరించారు. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు కలుగుతాయన్నారు. చిన్న వయస్సులో పెళ్లి చేసుకునే బాలుర తల్లితండ్రులతో పాటు, పురోహితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటి ఘటనలు తమ దృష్టికి వస్తే 1098 హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ రాఘవరావు, సామాజిక ఆరోగ్య అధికారి మహేశ్వరమ్మ, ఆరోగ్య కార్యకర్త వెంకటలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై నివేదికలివ్వండి



సమావేశంలో మాట్లడుతున్న డీడీ శ్యామల

సి.బెళగల్: మండలంలో ఏఏ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందో నివేదికలు అందించాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాణెమ్మ ఆధ్యక్షతన ఈఓ ఆర్డీ ఈశ్వరయ్యస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోసే నాయక్, ఇతర అధికారులు, సర్పంచ్‌లతో డీడీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌ల సమన్వయంతో పనిచేసి తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎంపీడీఓ, ఈఓఆర్డీ వాగ్వాదం

పంచాయతీ కార్యదర్శులు విధులను సక్రమంగా నిర్వర్తించడంలేదని ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామితో పాటు పలువురు ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శుల జీతాలను ఫిబ్రవరి నెలలో ఎంపీడీఓ రాణెమ్మ నిలుపుదల చేయించారు. దీనిపై ఈఓఆర్డీ ఎంపీడీఓను ప్రశ్నించారు. జీతాలు నిలుపుదల చేయించడం సరికాదని వాగ్వాదానికి దిగారు. కొద్దిసేపు ఇరువురు గట్టిగా అరుస్తూ వాదులాడుకున్నారు. వివిధ పనులకోసం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన ప్రజా ప్రనిధులు, ప్రజలు అధికారుల గొడవను చూసి అసహనం వ్యక్తం చేశారు.

అక్రమ సాగుపై చర్యలు తీసుకోండి



ప్రభుత్వ భూమిలో అక్రమంగా సాగుచేసిన పంటను చూపుతున్న నాయకులు

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామ పరిధిలోని ఓబులమ్మ చెరువుకు సంబంధించిన ప్రభుత్వ భూమిలో రెండు కార్లు పంటను పండించుకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌బీ నాయకులు వనం వెంకటాద్రి, ఎస్ఎస్‌యూఐ బత్తిని ప్రతాప్ గురువారం డిమాండు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిన్నాపురంలోని సర్వే నంబర్ 1638లో 8.09 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఏడాదికి రెండు కార్ల పంటలు సాగు చేసుకుంటూ ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా చెల్లించడం లేదన్నారు. దీనిపై గత కొన్నేళ్ల నుంచి మైనర్ ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): వేసవిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కారణంగా ప్రజలు వడదెబ్బకు గురిగాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి సూచించారు. గురువారం స్థానిక ముజఫర్ నగర్‌లోని 82వ సచివాలయం పరిధిలో వడదెబ్బ నివారణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఉదయం 10 గంటల్లోపు తమ పనులు ముగించుకుని నీడ ఉన్న ప్రదేశాల్లో ఉండాలని, ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, తలపై టవల్ పెట్టుకుని, కాళ్లకు చెప్పులు ధరించి వెళ్లాలని సూచించారు. నీళ్ల బాటిల్ వెంట తీసుకెళ్లాలని, గంట గంటకు నీరు తాగాలన్నారు. లేకపోతే శరీరంలోని నీరు, లవణాలు చెమట రూపంలో ఆవిరై నీరసంతో వడదెబ్బకు గురవుతారని చెప్పారు. వడదెబ్బ లక్షణాలు, ప్రథమ చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, ఆరోగ్య కార్యకర్త పుష్పావతి పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక తల్లి చెంతకు..



బాలికను తల్లికి అప్పగించిన పోలీసులు

కర్నూలు: కర్నూలు శివారులోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో నివాసముంటున్న శిరీష కూతురు హిమ (4) ఇంటి వద్ద ఆడుకుంటూ బయటకు వెళ్లి తప్పిపోయింది. తల్లి ఫిర్యాదుతో గంట వ్యవధిలోనే పోలీసులు బాలికను గుర్తించి తల్లి చెంతకు చేర్చారు. బయటికెళ్లిన కూతురు ఎంత సేపటికీ తిరిగి రాకపోవడం, చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో తల్లి మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. డీఎస్పీ బాబుప్రసాద్ నేతృత్వంలో సీఐ శేషయ్య, ఎస్ఐ మన్మధ విజయ్, సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. నంద్యాల చెక్‌పోస్టు దగ్గర్లోని గుడ్‌షప్పర్డ్ స్కూల్ వద్ద పాపను గుర్తించారు. డీఎస్పీ బాబుప్రసాద్ బాలిక తల్లి శిరీషను తన కార్యాలయానికి పిలిపించి హిమను అప్పగించారు. తల్లి ఆనందంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.